క్లుప్తంగా

పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారిద్దాం



వనపర్తి: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన న్యూ ఇయర్ వేడుకలకు సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ కార్యక్రమాల కోసం సమయం ఇవ్వాలని కేటీఆర్ కోరినట్లు మాజీ మంత్రి తెలిపారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికలపై దృష్టి సారించి పట్టు సాధించుకుందామని తెలిపారన్నారు.

అభివృద్ధికి తోడ్పడండి



మదనాపురం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సచివాలయంలో సోమవారం కొత్తకోట మండల కాంగ్రెస్ నాయకులు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి దామోదరం రాజనర్సింహాతో పాటు దేవరకద్ర నియోజక వర్గం శాసనసభ్యుడు మధుసూదన్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఏడాదిలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను అమలుపరిచి, నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడాలని కోరారు.

ఏజీను కలిసిన న్యాయవాదులు

ఆత్మకూర్: తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన సుదర్శన్‌రెడ్డిని మున్సిపల్ వైస్‌చైర్మన్, హైకోర్టు న్యాయవాది విజయభాస్కర్‌రెడ్డి సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆత్మకూర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు అభివృద్ధి, పలు విషయాల గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు రవీందర్‌రెడ్డి, కిషోర్, ముక్తేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు పునరుద్ధరించండి

వీపనగండ్ల: మండల కేంద్రం నుంచి పెబ్బేరు, వనపర్తి పట్టణాలకు అనువుగా గోపల్‌దిన్నె మీదుగా రాకపోకలు సాగించే బస్సును కరోనా సమయంలో రద్దు చేయడంతో గోపల్‌దిన్నె, రంగవరం, గోవర్ధనగిరి గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి నుంచి రోడ్డు బాగా లేదన్న సాకుతో కొల్లాపూర్, వనపర్తి డిపోల అధికారులు బస్సులు తిరిగి పునరుద్ధరించలేదు. ఇటీవలే గోవర్ధనగిరి, వీపనగండ్ల గ్రామాల మధ్య డబుల్ బీటీ రోడ్డు పూర్తయిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దయిన బస్సును తిరిగి నడపాలని కోరుతున్నారు.

నిర్వాసితుల నిరీక్షణ ఫలించేనా?



పెబ్బేరు రూరల్: కొత్త సంవత్సరంలో, కొత్త ప్రభుత్వ పాలనలో శ్రీశైలం నీటి ముంపు నిర్వాసితులు నిరీక్షణ ఫలిస్తాయని బాధితులు ఆశిస్తున్నారు. వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాలోని 67 గ్రామాలకు చెందిన శ్రీశైలం నిర్వాసితులు సోమవారం మండల కేంద్రంలోని పీజేపీ ఆఫీస్ ఆవరణలో సమావేశమై వారి సమస్యలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త ముఖ్యమంత్రి ద్వారా త్వరలోనే ఉద్యోగాలు కల్పించి, ఆవాసం కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాలను ఆదుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందు, శివాజీరావు, శ్రీనివాసులు, వెంకటేష్, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మారోజు వీరన్నకు నివాళి

వనపర్తి టౌన్: కుల నిర్మూలన కోసం పోరాడిన మారోజు వీరన్న సేవలను మరువలేనివని ప్రజా వాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. మారోజు వీరన్న 62వ జయంతిని పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో టీజేఏసీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మారోజు వీరన్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, కవులు, గిరిరాజాచారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రాములోరి అక్షతల ఊరేగింపు



అమరచింతలో అయోధ్య రామయ్య అక్షతల ఊరేగింపు

అమరచింత: అయోధ్య నుంచి అమరచింతకు చేరిన సీతారామస్వామి అక్షతలను సోమవారం పట్టణంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. శ్రీరాములోరి అక్షతల కలశాలను పట్టణంలోని వేంకటేశ్వర ఆలయానికి తరలించగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప దీక్షాపరులతో పాటు విశ్వహిందూ పరిషత్ సభ్యులు మేళతాళాలతో పట్టణ పురవీధుల గుండా ఊరేగింపుగా స్థానిక రామలయానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ రోజు వీటిని కుటుంబ సభ్యులు భక్తితో తలపై చల్లుకోవాలని వీహెచ్‌పీ నాయకుడు తాటికొండ విజయ్, మేర్వరాజు తెలిపారు. అక్షతలను వార్డుల వారీగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, మ్యాడం కృష్ణయ్య, అంజిగౌడ్, గురుస్వాములు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: అయోధ్య శ్రీరాముల వారి అక్షతలను సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఖిల్లాఘనపురంతో పాటుగా అప్పారెడ్డిపల్లి, సల్కెలాపురం తదితర గ్రామాల్లో ప్రత్యేకంగా పూజలు నిర్వహించి భజన, డోళ్లు తదితర వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అక్షతలతో రాములోరి చిత్రపటాన్ని కూడా అందజేశారు. ఈ నెల 22 వరకు ప్రతి ఒక్కరూ ఇంటిలోని దేవుడి గదిలో ఉంచి నిత్యపూజలు నిర్వహించాలని ప్రజలకు దేవాలయ కమిటీ వారు విజ్ఞప్తి చేశారు. 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రతిష్ఠ పూర్తయిన తరువాత సాయంత్రం సమయంలో ప్రతి ఇంటిలో కనీసం 5 దీపాలు వెలిగించి దేవుడి వద్ద ఉంచిన అక్షతలను తలపై వేసుకోవాలని సూచించారు. కొన్ని అక్షతలను మిగిలించుకుని ఇంటిలోని దేవుడి దగ్గరే ఉంచి కుటుంబంలో శుభకార్యాలు జరిగినప్పుడు, పుట్టిన రోజుల సమయంలో తలపై వేసుకోవడం వలన రాములోరి ఆశీస్సులు ఉంటాయని చెప్పారు. అక్షతలు తీసుకునేందుకు ప్రజలు తమ తమ ఇళ్లను శుభ్రం చేసుకుని సిద్ధంగా ఉన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, దేవాలయ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని గుమ్మడంలో సోమవారం బీజేపీ వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ భక్తులతో కలిసి అయోధ్య నుండి వచ్చిన రామచంద్రస్వామి అక్షతలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామంలో ఉన్న ప్రతి ఇంటికీ అక్షతలు అందజేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో గొని వేమారెడ్డి, నారాయణ, ఓంప్రకాష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో అక్షతలకు పంచుతున్న దేవాలయ కమిటీ సభ్యులు



గుమ్మడంలో..

శాగాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు



బస్సు ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవతో శాగాపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బాలరాజుయాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ద బాలరాజు తెలిపారు. ఆదివారం గ్రామానికి వచ్చిన ఆర్టీసీ బస్సుకు పార్టీ నాయకులు, గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి కొంతకాలంగా ఆర్టీసీ బస్సు రాకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు, వ్యాపారస్తులు రవాణా పరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని వాపోయారు. ఈ విషయంపై ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ అధికారులతో మంత్రి మాట్లాడి గ్రామానికి ఆర్టీసీ బస్సును వేయించినట్లు వారు పేర్కొన్నారు. గ్రామానికి ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సింగన్న, నాగేంద్రం, పెద్ద మైబూషి, చంద్రయ్య, కుర్మయ్య, భీముడు, సుబ్బయ్య, లక్ష్మయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా మన ఊరు-మన బడి పనులు



పాఠశాలలో అసంపూర్తిగా వంటగది నిర్మాణం



రేకుల షెడ్‌లో కొనసాగుతున్న వంట గది

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతుల కల్పన కోసం ఏర్పాటు చేసిన మన ఊరు–మన బడి పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయి. బుసిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలో వంట గది, ప్రహారీ గోడ, డైనింగ్‌హాల్, బాత్‌రూం, మరుగుదొడ్లు, ఇతర మైనర్ మరమ్మతు నిమిత్తం రూ.42 లక్షలు మంజూరై ఏడాది పూర్తయినా పనులు ముందుకు సాగట్లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లోని వంట గది రేకుల షెడ్‌లో కొనసాగుతుంది. ఆయా పనులపై ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు ఏమాత్రం పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో ఎలాంటి పురోగతి లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. నిధులు ఉన్నా నిర్మాణంలో జాప్యం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమనే విమర్శలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణం పనులు వేగవంతంగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అయ్యప్పస్వామికి పడిపూజ, అభిషేకం చేస్తున్న మాలధారులు

ఆత్మకూర్: జ్యోతిస్వరూపుడు, హరిహరాసుతుడు అయ్యప్పస్వామి మహా పడిపూజ మహోత్సవాన్ని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అయ్యప్ప క్షేత్రంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహా పడిపూజకు మాలధారులు, భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. తెల్లవారుజామున గణపతి హోమం, ఉదయం 7గంటలకు కలశపూజ, ధ్వజారోహణం తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారి మహా పడిపూజ కార్యక్రమాన్ని గురుస్వాములు అనిల్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో చేశారు. అయ్యప్పస్వామి దీక్ష అందరికీ మోక్షదాయకమని, స్వామియే శరణం అయ్యప్ప అంటూ ఘోషించే అయ్యప్ప స్మరణ శుభదాయకమన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం, దీక్షాపరులకు బిక్ష ఏర్పాటు చేశారు. రాత్రి 7.30గంటలకు ప్రత్యేక పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నిత్య అన్నదాత శృతి జువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ, అరుణ దంపతులు, గురుస్వాములు ఎస్టీడీ శ్రీను, జిన్నారం శ్రీను, బాలు, తోట రవి, గాడి లక్ష్మణ్, పురుషోత్తం, దివాకర్, నరేష్, శ్రవణ్, చక్రధర్, శ్యాంసుందర్‌రెడ్డి, హర్షగౌడ్, చందుగౌడ్, దీక్షాపరులు, బక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



పెద్దమందడిలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన బోయ రాములు(60) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయాన్ని సర్పంచ్ వెంకటస్వామి ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణ సాయంగా రూ.6వేలు అందజేయాలని సూచించడంతో సర్పంచ్ వెంకటస్వామి మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం రూ.6వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టైలర్ రవి, వార్డు సభ్యులు రామాంజనేయులు, వెంకటన్న, కురుమూర్తి తదితరులు ఉన్నారు.

మదనాపురం: మండలంలోని దుప్పల్లికి చెందిన పల్లెపాగ కిష్టమ్మ సోమవారం అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న దేవరకద్ర ఎమ్మెల్యే ఎ మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు మండల కాంగ్రెస్ నాయకులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగన్న, ఉపాధ్యక్షులు వడ్డె కృష్ణ, మాజీ ఎంపీపీ మహాదేవన్‌గౌడ్, రైతుబంధు మండల మాజీ అధ్యక్షుడు హనుమాన్‌రావు, గ్రామ అధ్యక్షుడు శేఖర్, ఖాజామైనోద్దీన్, చీర్ల లక్ష్మయ్య, చక్రవర్ధన్‌రెడ్డి, సుదర్శన్, ఖాజా, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోడగుట్టపైనే చిరుతల సంచారం!

- ఆందోళనలో సమీప గ్రామాల ప్రజలు
- ఆదివారం రాత్రి వసురాంతండాకు చెందిన భద్రునాయక్ గొర్రెను ఎత్తుకెళ్లిన వైనం
- ఫారెస్టు అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



చిరుతలు సంచరిస్తున్న మల్కిమియాన్‌పల్లి శివారులోని బోడగుట్ట

ఖిల్లాఘనపురం: ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు గానీ రెండు చిరుతలు ఖిల్లాఘనపురం మండలంలోని మల్కిమియాన్‌పల్లి శివారులో ఉన్న బోడగుట్టపై పాగావేశాయి. ఆదివారం రాత్రి వసురాంతండాకు చెందిన భద్రునాయక్ గొర్రెను ఎత్తుకెళ్లి గుట్టపైన ఓ గుహలో తిని, కొంత భాగాన్ని వదిలేశాయి. సోమవారం తెల్లవారిన తరువాత గ్రామస్తులు కొంతమంది గుట్టపైకి గుంపుగా వెళ్లారు. ఆ సమయంలో గ్రామస్తులు పై భాగాన వెతుకుతుంటే, చిరుతలు కింది భాగాన కనిపించాయి. ఓ గుహలోకి వెళ్లడంతో గ్రామస్తులు భయపడి వచ్చేశారు. సాయంత్రం 4 గంటల సమయంలో మరోమారు రెండు చిరుతలు గుట్టపైన కనిపించాయి. ఒక చిరుత కిందికి వస్తుండటంతో గ్రామస్తులు కేకలు వేయడంతో పైకి వెళ్లింది. మరో చిరుత గుట్టపై భాగాన పడుకుని కనిపించింది. విషయం తెలుసుకున్న ఫారెస్టు సిబ్బంది కొందరు అక్కడికి వచ్చి ప్రత్యక్షంగా చిరుతలను చూశారు.

పది రోజులుగా..

2023 డిసెంబర్ 21న అదే గుట్టపై రెండు చిరుతలు కనిపించడంతో మల్కిమియాన్‌పల్లి గ్రామస్తులతో పాటుగా చుట్టు పక్కల ప్రజలు భయపడిపోయారు. సుమారు 12 రోజులు కావస్తున్నా అవి బోడ గుట్ట పరిసరాల్లోనే సంచరిస్తుండడంతో రైతులు పొలాలకు వెళ్లాలంటే వణికిపోతున్నారు. గుట్ట చుట్టుగా అల్లమాయపల్లి, హీర్లతండా, వసురాంతండా, సూర్యతండా, దేవబండతండా, అప్పారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన రైతుల వ్యవసాయ పొలాలు ఉన్నాయి. బోడగుట్ట పక్కనే వనపర్తి, మహబూబ్‌నగర్ వెళ్లే ప్రధాన రోడ్డు ఉంది. సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకొని చిరుతలను బంధించాలని ప్రజలు వేడుకుంటున్నారు. ఈ విషయమై జిల్లా ఫారెస్టు అధికారి నవీన్‌రెడ్డిని వివరణ కోరగా.. గత వారం చిరుతలు కనిపించాయని గ్రామస్తులు చెప్పడంతో తమ సిబ్బంది వెళ్లగా.. అవి కనిపించకపోవడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సోమవారం మళ్లీ బోడగుట్టపై రెండు చిరుతలు కనిపించినట్లు గ్రామస్తులు, సర్పంచ్ చెప్తున్నారు. మంగళవారం ఉదయం గుట్టపైకి వెళ్లి చిరుతలు ఎక్కడ ఉన్నా పట్టుకోవడానికి ప్రయత్నిస్తాం. గుట్ట చుట్టు ఉన్న గ్రామాలు, తండాల ప్రజలు గుట్ట పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు.

ఘనంగా ఉర్సు



అమరచింత: మండలంలోని పాంరెడ్డిపల్లిలో వెలసిన సయ్యద్‌షా మహబూబ్ ఉస్సేనీ దర్గా ఉర్సోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. సోమవారం దర్గాలో ప్రత్యేక ఫాతేహ కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు దర్గా షరీఫ్ వద్ద కందూర్లను భక్తిశ్రద్ధలతో నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అమరచింత జామీయా మసీదు కమిటీ సభ్యులు దర్గా షరీఫ్‌లో చాదర్‌ను సమర్పించారు. ప్రతి ఏడాది గ్రామంలో వెలసిన మహబూబ్ ఉస్సేనీ దర్గా వద్ద మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ అని సర్పంచ్ బండి పావని వెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఖాజాహుస్సేన్, రఫీక్, ఖాసీం పాల్గొన్నారు.

తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా మార్చాలి



పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణానికి అయిదు కిలో మీటర్ల దూరంలో ఉన్న తిరుమలయ్య గుట్టను పర్యాటక కేంద్రంగా మార్చాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము డిమాండ్ చేశారు. ఆయన బీజేపీ నాయకులతో కలిసి సోమవారం తిరుమలయ్యగుట్టను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడ కొలువైన తిరుమలనాథస్వామి మహిమ గల దేవుడని, స్వామికి భక్తులు లక్షల మంది ఉన్నారు. స్వామి వారికి ప్రతి నిత్యం ధూపదీప నైవేద్యాలతో పాటు కల్యాణ మండపం, పార్కు, తాగునీటి వసతి కల్పిస్తే భక్తుల తాకిడి పెరుగుతుందన్నారు. తిరుమలయ్యగుట్ట వనపర్తి జిల్లాకు తలమానికంగా ఉంటుందని తెలిపారు. అధికారులు, తిరుమలయ్యగుట్టపై ప్రత్యేక దృష్టి సారించి పర్యాటక కేంద్రంగా మార్చాలని కోరారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ఆత్మకూర్‌లోని సాయిబాబా ఆలయంలో పోటెత్తిన భక్తులు

కొత్తకోట: ఆంగ్ల నూతన సంవత్సరం, సోమవారం కలిసి రావడంతో మండలంలోని కానాయపల్లి స్టేజీ వద్ద గల కోటి లింగేశ్వర దత్త దేవస్థానము భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఇళ్ల ముంగిట ముగ్గులు వేసి రంగులతో ముస్తాబు చేశారు. సోమవారం మహిళలు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల సందర్భంగా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ వేణు గట్టి బందోబస్తు నిర్వహించారు.

గోపాల్‌పేట: ఉమ్మడి మండలంలోని బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆయలం, గోపాల్‌పేట కోదండరామస్వామి ఆలయం, శివాలయాలు, రేవల్లి మండలంలోని గొల్లపల్లి ఆలయం, శానాయిపల్లి ఆలయంలో సోమవారం యువత, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో రోడ్డుపై వరకు భక్తులు బారులు తీరారు.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి గ్రామాల్లో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్‌లను కట్ చేశారు. సోమవారం ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సుకన్య, జయంతి తదితరులుపాల్గొన్నారు.

మదనాపురం: మండలంలోని గోపన్‌పేట, దుప్పల్లి, మదనాపురం, కొన్నూరు, నర్సింగాపురం, తిర్మలాయపల్లి గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అదేవిధంగా ఆయా గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు.

ఆత్మకూర్: పట్టణంలోని బీసీకాలనీలో ఉన్న ఎంబీ చర్చిలో, మూలమళ్ల, ఖానాపూర్, రేచింతల చర్చీల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఫాస్టర్లు రేవాజర్మియా, విద్యాసాగర్, డేవిడ్, శ్యాంసుందర్, సుమన్ ఆధ్వర్యంలో బైబిల్ సూక్తులు వినిపించి ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



అమరచింతలో..

సాయిబాబా ఆలయంలో..

పట్టణంలోని సాయిబాబా ఆలయంలో భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దివాన్జీ ప్రభాకర్‌రావు, సంతోష్‌కుమార్, రమేష్ శెట్టి, జూరాలగ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రముఖుల శుభాకాంక్షలు

మక్తల్ నియోజకవర్గ పరిధిలోని ప్రజలకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ స్వర్ణమ్మ, రాష్ట్ర కల్లు గీత డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేషం నాగరాజుగౌడ్, ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ శివరంజని, విండో అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రిరవి యాదవ్, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



కొత్తకోట కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో..



ఆత్మకూర్‌లో..



వీపనగండ్లలో..



బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో..

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

ఖిల్లాఘనపురం: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో ఓ గేదె మృతి చెందిన ఘటన ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తూము బాలకృష్ణారెడ్డి సోమవారం గేదెలను మేత కోసం తీసుకెళ్లారు. ఈ సమయంలో మేత కోసం కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లిన ఓ గేదెకు కరెంటు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. కళ్ల ముందే మేత మేస్తున్న గేదె ఒక్కసారిగా మృతి చెందడంతో రైతు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సుమారు రూ.70 వేల విలువ చేస్తుందని, ప్రభుత్వ పరంగా తమను ఆర్థికంగా ఆదుకోవాలని కోరుతున్నాడు.

ఈకేవైసీకి తప్పని తిప్పలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని విద్య ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ప్రతి నిత్యం మహిళలు ఈ కేవైసీ కోసం అధికసంఖ్యలో తరలివస్తున్నారు. గంటల కొద్దీ కార్యాలయం వద్ద మహిళలు నిరీక్షిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.500కే సిలిండర్ ఇవ్వనుండటంతో మండలంలోని పలు గ్రామాల నుంచి మహిళలు బారులు తీరుతున్నారు.